# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి
డా॥ యమ్. స్వర్ణముఖి
సి.వి. రమణ బాబు
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ



సంపుటి 40 సంచిక 4
పేజీలు 44
డిసెంబర్ 2020

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ – 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో** ............................. ....... **పేజీ**


దాశరథీ శతకము ........................................ 4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 5
అమ్మమాట........................................ 8
హైదరాబాద్ శాఖలో కార్యక్రమాలు..........10
అగస్త్య హృదయం ........................ ..............11
మంత్ర మహిమ ........................................13
లక్ష్యం ........................ ........................................16
రామాయణంలో స్త్రీ పాత్రలు......................17
బాబూజీతో అనుభవాలు ..............................19
నారాయణుడు................. ................... .................21
కరోనా బోధించిన పాఠం ..............................25
మధురం మధురం మధురం .................27
శ్రీ కృష్ణజన్మాష్టమి ................ ........ ...... .................29
శ్రీబాబు దివ్యవాణి ................ ..............................31
కైవల్యోపనిషత్ ... ..............................................32
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు............................34
పది నామాలవాడు........................ ...................35
రాణీ రాసమణి ....... ........ ..............................37
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39
విష్ణు కథలు ....... ............................ ...................41

## **దాశరథీ శతకము** - భద్రాచల రామదాసు

**శ్రీద సనందాది ముని సేవిత పాద దిగంతకీర్తి సం**
**పాద సమస్తభూత పరిపాల వినోద విషాద వల్లి కా**
**ఛ్ఛేద ధరాధినాథకుల సింధుసుధామయపాద నృత్తగీ**
**తాది వినోద భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ!**

సంపదల నిచ్చువాడవు, సనకసనందాది మునులచే పూజింప బడువాడవు, దశదిశలా వ్యాపించిన కీర్తిమంతుడవు, అన్ని భూతములను పాలించువాడవు, దుఃఖములను పోగొట్టువాడవు, క్షత్రియ కులమను సముద్రమునకు చంద్రుడవు, నృత్యము, గానము వేడుకగా గలవాడవు భద్రనిధీ!




*ఓం శ్రీమాత్రే నమః అనే మంత్రం ఎలా పుట్టింది?
*ఇంద్రియ సుఖాలకంటే ఎక్కువ ఆనందాన్నిచ్చేది ఏది?
*భవతారిణి కాళీమాత ఆలయాన్ని ఎవరు నిర్మించారు?
*కృష్ణుణ్ణి ఎటూ పారిపోకుండా ఎలా బంధించాలి?
*గురువాజ్ఞను అతిక్రమించినవారు ఎటువంటి బాధలు పడతారు?
*మాయా ప్రపంచం ఎలా మాయమైపోతుంది?
*గురుబోధను అర్థం చేసుకునే మార్గమేమిటి?
*మరణమనే పరీక్షలో విశ్వవిజేతగా నిలిచింది ఎవరు?
*శాశ్వతత్వాన్ని ప్రసాదించేది ఏది?
*అర్జునుడు పార్థుడు ఎలా అయ్యాడు?

***సమాధానాలు లోపలి పేజీలలో............................***

# శ్రీబాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

22-9-1980

ఈరోజు శ్రీబాబూజీ వ్యాహ్యాళికి వచ్చేసరికి కొంతమంది శ్రీ బాబూజీ ఇంటర్వ్యూ కోసం వేచియున్నారు. వారంతా కొన్ని వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి శ్రీ బాబూజీని దర్శించి ఆయన సలహామేరకు సమస్యల నుండి బయటపడటం సాధారణంగా జరిగే విషయము. మేమంతా శ్రీబాబూజీ బోధకోసం వేచి ఉన్నాము. శ్రీబాబూజీ స్వల్పంగా అస్వస్థతగా ఉన్నా, భక్తులను ఆనందపరచటమే వారి ఆశయం. మరి ఈ ఇరువురిలో ఎవరిని ఆనందపరచాలి అనేదే వారి ప్రస్తుత సమస్య. శ్రీబాబూజీ కొంచెంసేపు మౌనం వహించి "నాకు అస్వస్థతగా ఉన్న విషయము మీకందరికి తెలిసిందే కదా. కాని నాకు నా దేహబాధతో సంబంధం లేదు. దేహం పరిణామం చెందేదే. దాని కర్మ ఫలాన్ని అది అనుభవిస్తుంది. మీకు ఒక జరిగిన సంఘటన చెప్తాను.



శ్రీ రమణ మహర్షి ఒకసారి శిష్యబృందంతో కూర్చుని ఉండగా ఒక కందిరీగ కుట్టి ఆయన కాలు వాచింది. వారి శిష్యులంతా ఆ కందిరీగను వెంబడించి పట్టి తీసుకువచ్చి చంపబోతారు. కాని ఆయన చంపవద్దంటారు. కందిరీగ ఆత్మరక్షణ కోసం కుట్టిందిగాని వేరే విధంగా భావించకూడదు.

శ్రీరమణ మహర్షి ఆయన శిష్యబృందాన్ని, ఆ కుట్టిన కందిరీగని, ఒకే రకంగా ప్రేమించారు. ఆయన జ్ఞాని, దయామూర్తి. సమస్త జీవరాశి యందు దయ కలిగి ఉంటారు. జ్ఞానిని గుర్తించటం కష్టం. మనుష్యులతో సంచరిస్తూ సాధారణ వ్యక్తిగానే ఉంటారు. కొన్ని సందర్భాలలో మహాత్ములు మనుష్యుల మధ్య సంచరించకుండా, వారికి కనీసం దర్శనం కూడా ప్రసాదించకుండా ఉండటానికి కారణం లేకపోలేదు. శిష్యులు కొన్ని

సందర్భాలలో గురుదేవుల అనుజ్ఞ ప్రకారము నడచుకొనకపోతే గురువు ఆజ్ఞను అతిక్రమించినట్లవుతుంది. దాని ఫలితంగా కల్పాంతం వరకు సమస్త పాతకములను అనుభవిస్తారు. వారు అనుభవించవలసిన బాధలను వర్ణించటం కష్టము. అందుచేతనే సత్యగురువు శిష్యులకు తొందరగా ఆదేశములను ఇవ్వరు.

జ్ఞానికి పరమాత్మునికి తేడాలేదు. పరమాత్ముడు సగుణ బ్రహ్మగా అవతరించినప్పుడు ఎంతమంది గుర్తించగలరు? ఆ కాలంలో శ్రీరామచంద్రుని, శ్రీ కృష్ణపరమాత్ముని ఎంతమంది గుర్తించారు? శ్రీకృష్ణ పరమాత్ముని గొల్లవాడని, కొంటెవాడని, అల్లరివాడని, గోపికాలోలుడని, చిలిపివాడని అనేవారు. కృష్ణుడు ఏమి చేసినా ప్రజల మేలుకోసమేగాని తన స్వార్థంకోసం ఏమీ చేయలేదు. నా చిన్నప్పుడు నాకు చాలా పేర్లు ఉండేవి. దాసుగారని, కాళిదాసుగారని, కాళీబాబుగారని, ప్రసాదబాబు గారని, కోమటి సాధువుగారని, స్వామిగారని పిలిచేవారు. చివరకు భక్తులంతా కలసి శ్రీ హనుమత్ కాళీ వరప్రాదబాబుగారనే పేరు నాకు స్థిరపరిచారు. నన్ను గురించి కొంతమంది అవహేళనచేసి మాట్లాడేవారు. వారికి జరగవలసిన ప్రాయశ్చిత్తం జరిగేది. అందుచేత నన్ను చూచి, కొంతమంది భయపడేవారు.

జ్ఞానిని గుర్తించటం కష్టం. నివురుగప్పిన నిప్పువంటివారు. ఆయనలోని శక్తులన్నీ గోప్యంగా ఉంచుకుంటారుగాని బయటకు వ్యక్తం చేయరు. జ్ఞాని మామూలు మనిషివలె భోజనం చేయటం, స్నానం చేయటంవంటి క్రియలు నిర్వర్తిస్తాడు. అందుచేతనే గుర్తించటం కష్టము. ఆయన ఎప్పుడూ సహజ సమాధిలో ఉంటాడు. మీరంతా భగవచ్చింతన చేసుకొని ఆనందాన్ని పొందుదామని వచ్చారు. చాలా సంతోషము. కాని నా దగ్గరకు అనేకమంది అనేక బాధలతో వస్తూ ఉంటారు. వారి బాధ నివృత్తి చేయాలా వద్దా? నన్ను ఆశ్రయించిన అట్టి భక్తులకు కూడా ఆనందాన్ని కలగచేయాలి కదా! అలా చేయటం వలన వారు వారి సమస్యలతో నాకు చికాకు కల్గించవచ్చు. అయినప్పటికి జ్ఞాని తన కర్తవ్యాన్ని నిర్వహించాలి కదా. అలా చేయకపోతే అఖండత్వానికి మచ్చ వచ్చినట్లే కదా. మీకు ఒక ఉపమానం చెప్తాను. ఒక నదీప్రవాహంలో తేలు కొట్టుకుని వెళ్తుంది. ఆ తేలుని రక్షించాలా, అక్కరలేదా? ఆ తేలుని రక్షిస్తే దాని స్వాభావిక గుణంచేత, రక్షించేవాడిని కుట్టి బాధ కల్గిస్తుంది. అలాగని ఆ తేలుని రక్షించకుండా ఉండటం న్యాయమా?

అయితే నన్ను ఆశ్రయించేవారు నన్ను సంపూర్ణంగా విశ్వసిస్తేనే ఫలితాన్ని పొందుతారు. గురుబోధా శ్రవణము, మననం ద్వారా ధారణను పొందవచ్చును. ధారణవల్ల ధాముడు అవుతాడు. గురువునందు అచంచల విశ్వాసం ఉండాలి. అచంచల విశ్వాసం అంటే సంపూర్ణ శరణాగతి అన్నమాట. దుశ్శాసనుడు తనను మానభంగం చేయటానికి ప్రయత్నిస్తున్నప్పుడు ద్రౌపది 'ద్వారకానాథా దీనరక్షకా! గరుడవాహనా! నన్ను రక్షించు!' అని చేసిన ఆర్తనాదము కృష్ణ పరమాత్మకు వినపడదు. కాని ద్రౌపది సంపూర్ణ శరణాగతి పొంది 'ఆత్మ స్వరూపా! సర్వాంతర్యామీ! రక్షించవయ్యా!' అని కృష్ణపరమాత్మణ్ణి ప్రార్థించినప్పుడు ఆయన వెంటనే రక్షణను అందజేస్తాడు.

ఇదే విషయము అరణ్యవాసంలో ఉండగా పాండవులు శ్రీకృష్ణ పరమాత్మ దృష్టికి తేగా 'నాకు సమయానికి గరుడవాహనం అందలేదు. అంతేకాక ద్వారక చాలా దూరం ఉంది కాబట్టి రావటం ఆలస్యం అయింది' అని అంటాడు.

శ్రీ బాబు ఉద్బోధిస్తూ కాబట్టి పరమాత్మని ఎక్కడో ఉన్నట్లు భావించటం తప్పు. ఆయన సర్వాంతర్యామి. రూపనామ క్రియారహితుడైన పరమాత్మ కనబడటంలేదని, పరమాత్మ లేడనటం మూర్ఖత్వము, అవివేకము. తీగను మీటినప్పుడు నాదం వస్తుంది. అలాగని తీగలో నాదము కనబడుతుందా? నాదం గోచరించటంలేదని, తీగలో నాదంలేదని అనగలరా? నాదం మనస్సుని నిలకడ చేస్తుంది. అందుచేతనే త్యాగయ్య తన కీర్తనలచేత తరించాడు. జ్ఞాని బోధలు, వేదసమ్మతమైనవి, పురాణ సమ్మతమైన విషయాలు. అవి మనస్సుకు హత్తుకుపోయే విధంగా, సూటిగా గుచ్చుకొనే విధంగా ఉంటాయి.

అదే విషయాన్ని పండితులు శాస్త్రకారులు చెప్తే, భాషలో అందం కనబడుతుంది కాని పరమాత్మతత్వం అంత సులభంగా అందదు అని శ్రీ బాబు మాకు బోధ చెప్పేసి, మీ ఆకలి తీరింది కదా! ఇక మీరు నిష్క్రమిస్తే పాపం! ఇంటర్వ్యూ కోసం వచ్చిన వారితో మాట్లాడుతాము" అన్నారు.

# అమ్మమాట

- జపమాల ప్రసాద

## *బోధ అంటేనే జ్ఞానం*

శ్రీగురుదేవులు సత్యస్వరూపులు. మనను ఉద్ధరించడానికి ఒక అవతారం దాల్చి వచ్చినప్పుడు నిష్క్రమించడమూ వుంటుంది. వారు అవతారం దాల్చడమూ లీలే! నిష్క్రమించడమూ లీలే!

గురుమహరాజ్ గొప్పవారు. వారిని ఆశ్రయించిన మనమూ గొప్పవారమే. కానీ, ఆ సత్య వస్తువును మనం ఎంతవరకూ ఆస్వాదిస్తున్నా మన్నదే ప్రశ్న. తరించాలనే ఆతృత ప్రతి భక్త హృదయంలోనూ వుండాలి. గురుబోధామృత శ్రవణం ఒక మహాయజ్ఞం. ఆ బోధలో ఒక్క ముక్క మనసుకి పట్టినా చాలు తరించడానికి. భగవత్ స్మరణలో వినేదీ, చెప్పేదీ కూడా సేవయే. శాశ్వతత్వాన్ని ప్రసాదించేది సత్సంగం. మన సాధనకు సత్సంగం ఎంతో అవసరం. అక్కడ విన్నది మనస్సుకు పట్టించుకోవాలి; ఆచరించాలి; ఆనందించాలి. 'బోధ అంటేనే జ్ఞానం'.



అందరిలో వున్న సత్య వస్తువుని దర్శించాలంటే అది నిరంతర స్మరణ, విచారణ వల్లనే సాధ్యపడుతుంది. ఇది మనం రికార్డ్ చేసుకునే సమయం. భగవద్విషయం మనసులో ఎంత రికార్డ్ చేసుకోగలిగితే, అంత చేసుకోవాలి. బయట రకరకాల మీటింగ్‌లు పెట్టుకుని కాలం వృథా చేసుకోకండి. సాధన చేయడానికి శరీరంలో పటుత్వం వున్నప్పుడే సాధ్యపడుతుంది. కనుక మీ మనస్సుకి నచ్చచెప్పండి. కాలం గడిచి పోతుంది. దేహానికి వ్యాధి, వార్ధక్యం ముంచుకు వస్తున్నాయి. ఏ శ్వాస మన ఆఖరి శ్వాసో తెలియదు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి. మనసులో విషయాదులు లేకుండా ఖాళీ చేసుకోండి. భగవంతుడి సేవలో, చింతనలో వినియోగింపబడిన కాలమే సత్యకాలంలో జమ అవుతుందని చెప్పేవారు శ్రీబాబూజీ మహరాజ్. ఆధ్యాత్మిక జీవితం

సత్యమైనది. అట్టి జీవనం గడిపేవారికి అమృతత్వమే లభిస్తుంది.

అందరితోనూ సమభావం కలిగి వుండండి. ఈర్ష్య, అసూయ, అసహనం, ఓర్వలేనితనాలకి మనసులో తావివ్వకండి. నిరంతరం భగవన్నామ స్మరణలో, భగవత్తత్త్వ విచారణతో మీ మనస్సులను నింపండి.

మనస్సుని ఆహ్లాదపరచేది భగవన్నామం. కష్టాలను కలతలను దూరం చేసేవాడు కాళీప్రసాదబాబు అని నమ్మండి. మీ స్వరూపమే ఆనందం. అటువంటి ఆనందాన్ని ప్రసాదించే గురుపాదుకలు అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను, అఖండ సుఖ శాంతులను, ఆయురారోగ్యాలను ప్రసాదించి సర్వదా కాపాడుగాక!

## *భగవన్నామ స్మరణ ఎప్పుడు చేయాలి?*

సేకరణ - కె. రాఘవరాజు

'అంత్యకాలంలో ఎవరైతే నన్ను స్మరిస్తారో వారు నిస్సందేహంగా నన్నే చేరుకుంటారు. వారికి మరుజన్మ అంటూ ఏదీ వుండదు' అని శ్రీకృష్ణ పరమాత్మ సెలవిచ్చారు.

మనిషి ఒక పరీక్షలో పాస్ కావాలన్నా కొంతకాలంపాటు అభ్యాసము సాధన అవసరము. సంవత్సరమంతా కష్టపడి చదివితే పరీక్షల సమయంలో అన్నీ చక్కగా గుర్తుకు వస్తాయి. తేలికగా ఉత్తీర్ణులం కాగలము. అంతేకానీ అప్పటికప్పుడు చదివితే పరీక్షలో ఉత్తీర్ణులం కాలేము కదా! కొంత అభ్యాసం లేకుండా ఏ పనీ చేయలేం కదా! అలాగే అంత్యకాలంలో భగవంతుడు గుర్తుకురావాలంటే జీవితకాలమంతా కూడా భగవంతుని స్మరించడం ముఖ్యం. సంకటమొస్తే 'వేంకట రమణా!' అని తలిస్తే లాభమేమిటి? జీవితమంతా దుష్ట ఆలోచనలు, పనికిరాని ఆలోచనలతో గడిపితే అంత్యకాలంలో కూడా అవే గుర్తుకు వస్తాయి కానీ పరమాత్మ గుర్తుకురాడు.

కాబట్టి అంత్యకాలంలో కూడా పరమాత్మ స్మరణకు రావాలంటే, నిరంతరము భగవంతుని చింతన, ఆలోచన, స్మరణ, ధ్యానము ముఖ్యము. వీటిపట్ల నిర్లక్ష్యము, సోమరిపోతుతనం ఎట్టి పరిస్థితులలోనూ రాకుండా చూసుకోవాలి. అప్పుడే భగవంతుడు దగ్గరవుతాడు.

# హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**డిసెంబర్ 2020**

3 గురు - శ్రీబాబూజీ స్వస్వరూపలయం చెందిన రోజు. సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

9 బుధ - శ్రీ గురుదశమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

16 బుధ - శ్రీధనుర్మాస వ్రత ప్రారంభం.

20 ఆది - సుబ్రహ్మణ్య షష్ఠి .ఉ॥ 11 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

25 బుధ - క్రిస్మస్, గీతా జయంతి, ముక్కోటిఏకాదశి ఉ॥ 11గం. శ్రీ సద్గురుపాదపూజ, భక్త సమారాధన.

30 బుధ - మార్గశిర పౌర్ణమి, దత్తజయంతి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

**జనవరి 2021**

1 శుక్ర - ఆంగ్ల సంవత్సరాది. సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

8 శుక్ర - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

13 బుధ - భోగి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ. రాత్రి 7గం.లకు శ్రీబాబుకు భోగిపండ్లు పోయుట.

14 గురు - సంక్రాంతి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

28 గురు - పుష్య పూర్ణిమ - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

# అగస్త్య హృదయం

- వారణాసి కాళీప్రసాద్ U.S.A

మన సనాతన సంప్రదాయంలో, పురాణేతిహాసములలో గురువులకు, ఋషులకు విశేషమైన ప్రాధాన్యత ఇవ్వబడినది. వాల్మీకి మహామునిచేత విరచితమై, ఆదికావ్యంగా పరిగణింపబడుతున్న శ్రీమద్రామాయణము కూడా ఆద్యంతమూ గురువుల ప్రస్తావనతోనే వుంటుంది. అలా ప్రస్తావించబడిన అనేకమంది గురువులలో అగస్త్యమహర్షి ఒకరు. బహుళ ప్రచారంలో వున్న ఆదిత్యహృదయమును రామాయణాంతర్గతమైన యుద్ధకాండలో అగస్త్యులవారు శ్రీరామచంద్రునికి బోధించడమూ, తదుపరి రాములవారు రావణసంహారం చేయడమూ మనకందరికీ విదితమే. నేటికీ ఆదిత్య హృదయం చిత్తశుద్ధితో పారాయణ చేసినవారికి తమ మనోభీష్టములు సిద్ధించి వారి ప్రణాళికలలో విజయం సాధిస్తారన్నది ప్రతీతి.

అయితే, ఆదిత్యహృదయం యొక్క పూర్వాపరాలను నిశితంగా పరిశీలిస్తే కొన్ని ఆసక్తికరమైన ప్రశ్నలు ఉదయిస్తాయి. అగస్త్యో భగవాన్ ఋషిః అని వాల్మీకి మహర్షిచే కొనియాడబడిన అగస్త్యుల వారి పాత్ర రామాయణంలో ఎటువంటిది? రాములవారికీ అగస్త్యుల వారికీ మధ్యనున్న అనుబంధం ఏమిటి? రావణ వధ ముందు అగస్త్యుల వారు హుటాహుటిన యుద్ధ రంగానికి రావలసిన అవసరం ఏమిటి? రామ రావణ యుద్ధాన్ని చూడటానికి ఎంతోమంది దేవతలు వచ్చి నిలచివున్నప్పుడు యుద్ధరంగంలోనే వున్న అగస్త్యుడు రావణవధ వరకూ వీక్షించకుండా వుండటానికి కారణం ఏమయి వుండవచ్చు? సూర్యస్తుతిలా కనిపించే ఆదిత్య హృదయంలో నిగూఢమైన ప్రబోధము దాగివున్నదా? **'శృణు గుహ్యం సనాతనమ్'** అంటూ అగస్త్యులు వివరించిన గుహ్యమైన, సనాతనమైన సందేశం ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానం అన్వేషిస్తే ఆదిత్యహృదయం యొక్క పరమ ప్రయోజనము అవగతమవుతుంది.

మరింత లోతుగా పరిశీలిస్తే మహాభారతాంతర్గతమైన భగవద్గీతకూ, రామాయణాంతర్గతమైన ఆదిత్య హృదయమునకూ కొంత సారూప్యం కనిపిస్తుంది. **హృద్దేశేర్జున తిష్ఠతి** అన్నట్లుగా హృదయస్థలైన

గురుదేవులు శిష్యులను ఏ విధంగా కాపాడతారో అన్న విషయం అర్థమవ్వాలంటే శ్రీరామచంద్రుని తన లక్ష్యం వైపు క్రమంగా తీసుకువెళ్ళి విజయ పథంలో నడిపించిన ***అగస్త్యహృదయము***ను ఆవిష్కరించవలసి వుంటుంది. గురుశక్తికీ, గురు తత్వానికీ ప్రతీకలైన అగస్త్యులవారి హృదయాన్ని పరిశీలిస్తే వారు అందించిన శ్లోకాలలో వున్న గుహ్యమైన రహస్యాలు బోధపడతాయి. అప్పుడు ఆదిత్య హృదయం కేవలం పారాయణ స్తోత్రములాగా కాకుండా విశేషమైన విచారణ సాధనంగా కూడా వుపయోగపడుతుంది.

దశావతారాలలో ఒకటైన వామనావతారములో శ్రీమహావిష్ణువు అదితి, కశ్యపులకు జన్మించి ఆదిత్యుడుగా పిలువబడతాడు. ఆ ప్రకారం ఆదిత్యహృదయం జగద్గురువులైన శ్రీకృష్ణ హృదయాన్ని, గురు తత్వాన్ని వివరిస్తుంది.

శ్రీగురుదేవులైన హృదయబాబు ప్రేరణతో అలాంటి అంశాలను విశ్లేషించడానికి నా బుద్ధికి అందిన మేరకు చేసే చిన్న ప్రయత్నమే ఈ అగస్త్య హృదయము.

- సశేషం

## భక్తులకు విన్నపము

శ్రీగురుదేవుల అనుగ్రహం వలన భక్తులు పొందిన అనుభవాలను గ్రంథస్థం చేసే ఉద్దేశ్యంతో తమ తమ అనుభవాలను వ్రాసి పంపమని విజ్ఞాపన చేసియున్నాము.

శ్రీగురుదేవుల స్వస్వరూప లయం తరువాత, శ్రీగురుమాత ద్వారా మనకు అనేకవిధాల రక్షణ జరుగుతోంది. అనేక లీలలను వారు చూపిస్తున్నారు. అనేక దివ్యానుభవాలు భక్తులకు కలుగుతున్నాయి.

భక్తులు పొందిన అట్టి అనుభవాలను భక్తులందరూ పంచుకొనే సంకల్పంతో తలపెట్టిన "శ్రీసద్గురునాధుని దివ్య చరిత్ర – 3" గ్రంథం పేరు మార్చి **"శ్రీ గురు కృప"** అని పేరు నిర్ణయించటం జరిగింది.

అందరూ ఈ మార్పును గమనించి తమ తమ అనుభవాలను సమగ్రంగా వ్రాసి సత్వరంగా పంపమని ప్రార్థిస్తున్నాము.

# మంత్ర మహిమ

సేకరణ - వంకిన సాయి కృష్ణ

ఒకసారి పాల సముద్రంపై శేషపాన్పు మీద శ్రీమహావిష్ణువు లక్ష్మీ సమేతుడై వుండగా, అనుకోకుండా పార్వతీదేవి, సరస్వతీదేవి ఇద్దరూ లక్ష్మీదేవిని చూడటానికి వైకుంఠానికి వచ్చారు. అల్లంత దూరాన వారిని చూసిన లక్ష్మీదేవి భర్త అనుమతితో ఆయన పాదాలను వత్తడం ఆపి, శేషపాన్పు దిగి వారిద్దరినీ సాదరంగా ఆహ్వానించింది.

ముగ్గురూ సమీపంలోని ఒక ఉద్యాన వనానికి వెళ్ళి, ఒక చంద్రశిలపై కూర్చుని ఇష్టాగోష్ఠిగా మాట్లాడుకుంటున్నారు. ఇంతలో దూరంగా నారదుడు రావడం చూశారు. నారదుడు కూడా వీరిని గమనించాడు. ఇంకేమి 'కలహభోజనుడు' తనకు కావలసినంత కాలక్షేపం దొరికింది కదా అనుకున్నాడు. త్రిమూర్తుల భార్యలందరూ ఒకచోట చేరి, ఏదో ఒక విషయాన్ని గురించి మాట్లాడుకుంటున్నారు. ఇప్పుడు ఏదో ఒక చిక్కు ప్రశ్నవేసి, వారి మధ్య కలహాన్ని రేపి, తన నామానికి సార్థకతను చేకూర్చుకోవాలనుకున్నాడు.

అదేవిధంగా జగన్మాతలు కూడా నారదుడిని చూసి, 'ఈ కలహ భోజనుడు ఊరకనే రాడు. కనుక ఇతనికి తగిన విధంగా బుద్ధి చెప్పాలి' అనుకుని ఆయనను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నారదుడు ముగురమ్మలకు నమస్కరించాడు. వారు ఆయనను ఆశీర్వదించి, విషయాలేమిటి? అని అడిగారు. నారదుడు మాట్లాడుతూ 'త్రిమూర్తులకు భార్యలైన మిమ్మలను సకలలోక వాసులూ స్తుతిస్తుంటారు. అంతవరకూ బాగానే వుంది. కానీ మీ ముగ్గురిలో ఎవరు గొప్ప? అన్న సందేహం వారిలో చాలా మందిని బాధిస్తోంది' అన్నాడు. ముగురమ్మలూ కలసి 'నారదా! నీ సందేహం ధర్మసమ్మతమే. నువ్వు భూ లోకంలో మేము చెప్పిన చోటుకు వెళ్ళి, అక్కడ వున్న మా భక్తులను పరీక్షించి, మేము చెప్పిన మంత్రాన్ని వారికి ఉపదేశించు. కొంతకాలం తరువాత మాలో ఎవరు గొప్పో నీకే అర్థం అవుతుంది' అని చెప్పారు.

ముందుగా సరస్వతీదేవి నారదునితో 'నారదా! భూలోకంలో మహాబలిపురంలోని ఒక గురుకులంలో సెల్వనాధుడనే ఒక విద్యార్థిని కలసుకుని, సమయం, సందర్భం చూసుకుని, అతని చెవిలో **'ఓం శ్రీమాత్రే నమః'** అనే మంత్రాన్ని మూడుసార్లు ఉచ్చరించి, అతనికి దానిని

వుపదేశించు. ఆ తరువాత జరిగిన విషయాన్ని మాకు తెలియజేయి' అని చెప్పింది.

నారదుడు ఒక పండితుని వేషం వేసుకుని, సెల్వనాధుడి బంధువుగా మహాబలిపురం వెళ్ళి సెల్వనాధుడి గురువును కలిశాడు. అతని బంధువని తెలుసుకున్న గురువు 'సెల్వనాధుడికి అక్షరం ముక్క రాదు. వాడితో నా ప్రాణాలు విసిగిపోయి, పశువులు మేపుకురమ్మనమని పంపించాను. అక్కడకు వెళ్ళి వాడిని చూడండి' అన్నాడు. నారదుడు విషయం తెలుసుకుని, అడవికి వెళ్ళి సెల్వనాధుడిని కలిశాడు. ఆ బాలుడు నారదుడిని చూసి బోరుమని ఏడుస్తూ తనకు చదువు రావడంలేదని, తను పడే కష్టాలన్నీ చెప్పాడు. నారదుడు ఆ బాలుడుని ఓదార్చి, 'నీకు ఒక మంత్రోపదేశం చేస్తాను. ఆ తరువాత ఏం జరుగుతుంతో చూద్దాం' అన్నాడు. ఆ బాలుడు శుచియై స్నానం చేసి వచ్చిన తరువాత అతనికి చెవిలో **'ఓం శ్రీమాత్రే నమః'** అనే మంత్రాన్ని చెప్పి, 108సార్లు జపం చేయమని చెబుతాడు. అలా జపం చేసిన తరువాత ఆ బాలుడు శాస్త్రాలు, వేదాలు సులభంగా అర్థం చేసుకోగలిగాడు. అలా కొంతకాలం పరీక్షించిన తరువాత నారదుడు ముగురమ్మల దగ్గరకు వచ్చి ఆ విషయం చెప్పాడు.

ఇప్పుడు పార్వతీదేవి తన వంతు ప్రారంభించినది. 'నారదా! కావేరి నది ఒడ్డున సమయపురం అనే ఊరుంది. అక్కడ పెరినాయకి అనే ఆవిడ ఇంటి గురించి అడుగు. అక్కడ పరిస్థితులు, సమయం, సందర్భం చూసి నేను చెప్పే ఈ **'ఓం శ్రీమాత్రే నమః'** అనే మంత్రాన్ని ఆవిడకు వుపదేశించు. తరువాత పరిస్థితి వచ్చి మాకు చెప్పు' అన్నది.

ఆ ఊరు వెళ్ళి పెరినాయకిని కలుసుకుని ఆత్మహత్యా ప్రయత్నంలో వున్న ఆమెను నిరోధించాడు. ఆమెకు సంతానం లేకపోవడం వలన ఆమె భర్తకు రెండవ పెళ్ళి చేయబోతున్నారని, అందుచేత మనస్తాపంతో ఆత్మహత్యకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలుసుకున్నాడు. ఆమెకు ఈ మంత్రాన్ని ఉపదేశించి 108సార్లు జపం చేయమన్నాడు. ఈ మంత్రజప ఫలితంగా కొద్దిరోజులకు ఆమె గర్భవతి అయింది. ఈ విషయాన్ని నారదుడు ముగురమ్మలకు చేరవేశాడు.

ఇక ఇప్పుడు లక్ష్మీదేవి 'నారదా! గోదావరి ఒడ్డున వున్న తాటాకుల ఇంటిలో రాజశేఖరుడు అనే ఒక పేద బ్రాహ్మణుడిని కలిసి సమయం చూసి అతనికి **'ఓం శ్రీమాత్రే నమః'** అనే ఈ మంత్రాన్ని ఉపదేశించు. తరువాత జరిగినదానిని వచ్చి చెప్పు మాకు' అన్నది.

నారదుడు మారువేషంలో వెళ్ళి అతనిని కలుసుకున్నాడు. రాజశేఖరుడు మారువేషంలో వున్న నారదుడికి తన వద్ద కుండలో వున్న కొద్ది బియ్యాన్ని దానం చేయగా, వెంటనే అతని కుండ మళ్ళీ బియ్యంతో నిండిపోయింది. ఇది చూసి ఆశ్చర్యపోయిన రాజశేఖరుడు ఇటువంటి సంఘటన ఇంతకు ముందెన్నడూ జరుగలేదు అంటాడు. నారదుడు అతనికి కూడా **'ఓం శ్రీమాత్రే నమః'** అనే మహామంత్రాన్ని ఉపదేశించి 108సార్లు జపం చేయమన్నాడు.

ఆ తరువాత ఆ పేదబ్రాహ్మణుడు శ్రీమంతుడిగా మారిపోయాడు. ఈ అద్భుతాన్ని కళ్ళారా చూసిన నారదుడు ఆశ్చర్యపోయి, తన అజ్ఞానానికి సిగ్గుపడుతూ ముగురమ్మలనూ కలసి ఈ విషయాన్ని చెప్పాడు. 'అమ్మల్లారా! మిమ్మల్ని నేను అర్థం చేసుకోలేక ఈ ప్రశ్న అడిగాను. అసలు ఈ మంత్రం ఎలా పుట్టింది?' అని అడిగాడు. దానికి సమాధానంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ 'బ్రహ్మమానస పుత్రా! మా ముగ్గురి శక్తిలో ఎటువంటి తేడాలు వుండవు. జగదంబ ఆజ్ఞానుసారం ...... నా వలన ఐశ్వర్యం, పార్వతీదేవి వలన ఐదవతనం, సౌభాగ్యం, సరస్వతీదేవి వలన విద్యలు, కళలు ప్రాప్తిస్తూ వుంటాయి. శ్రీ లక్ష్మిలోని, శ్రీ సరస్వతిలోని, శ్రీ శక్తిలోని బీజాక్షరాలను జతచేసి **'ఓం శ్రీమాత్రే నమః'** అనే మంత్ర సృష్టి జరిగింది. ఈ మంత్రాన్ని జపించిన వారికి మా కటాక్షం కలుగుతుంది. అందుచేత నీవు అర్హులైన మా భక్తులందరికీ ఈ మంత్రాన్ని ఉపదేశించు' అని చెప్పింది.

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన ఆత్మకూరి వెంకట లీలా కృష్ణమూర్తిగారు (గుటూరు గుప్తాగారి అల్లుడు)15-11-2020 ఆదివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 58 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# లక్ష్యం

- పాలూరి కాళీప్రసాద్

మహాత్ములు ఆవుపాలు పితికినంత కాలం కూడా ఎక్కడా నిలకడగా వుండరు అనేది నానుడి. జన్మతః బ్రహ్మజ్ఞానియైన శ్రీ శుకుడు కూడా అలాగే నిరంతరం దేశ సంచారం చేసేవారు. జనక మహారాజు నుండి జ్ఞానం పొందడానికి, పరీక్షిత్తు మహారాజుకు శ్రీమద్భాగవతం బోధించడానికి - ఈ రెండు సందర్భాలలో తప్ప ఆయన ఎక్కడా స్థిరంగా వున్నట్లు కనబడదు.

ఒకసారి ఇదే విషయాన్ని గురువుగారు (శ్రీ లలితానంద సరస్వతీ స్వామిని) వివరిస్తూ గట్టిగా ఇక్కడ కూర్చుని మాట్లాడితే, ఈ ఆసనం నాదని, ఈ మైక్ నాదని మోహం కలుగుతుంది. అందుకే మహాత్ములు నిరంతరం లోకసంచారం చేస్తూ వుంటారని చెప్పారు.

ఏదేమైనా ధ్యానం, విచారణ, సంకీర్తన, అర్చన, తీర్థయాత్ర, పఠన, శ్రవణాదులన్నీ పరమాత్ముని చేరే మార్గాలే. ప్రతీ మార్గంలో దానికి సంబంధించిన కష్టనష్టాలు వుంటాయి. అయితే ఇది కేవలం మార్గమేనని నిరంతరం గుర్తుంచుకుని తన అంతిమ లక్ష్యం అయిన భగవంతునిపైనే మనస్సుని నిలిపినవాడు లక్ష్యాన్ని చేరుతాడు. అలా కాక మార్గం మీద వ్యామోహం పెంచుకున్నవాడు చిరకాలం ఆ మార్గంలోనే వుండిపోతాడు.

అందుకే అమ్మ మనలను తరచుగా హెచ్చరిస్తూ 'ఎంతసేపూ చదవడమే, చెప్పడమే, వినడమే వాసనగా పెంచుకోకండి. దాని వెనుక వున్న అసలు లక్ష్యాన్ని గుర్తించండి' అంటూ వుంటారు.

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన పోపూరి శ్రీరామ్మూర్తిగారు (DIG గారి తండ్రి) 16-11-2020 సోమవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 90 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# రామాయణంలో స్త్రీ పాత్రలు -సుషుమ్నా ప్రసాద

# సీత

సీతా సాధ్వి రామాయణమనే మాణిక్యమాల దివ్య సౌందర్యమును ద్విగుణీకృతం చేసే నవ రత్నాల పతకం లాగా ప్రకాశిస్తుంది. రామాయణంలోని స్త్రీపాత్రలలో సీత నిరుపమానమైనది. స్త్రీ అంటే స, త, ర సమ్మేళనము. అంటే - సత్యము, తపస్సు, రమణీయత సమపాళ్ళల్లో రంగరిస్తే, వాటి సమ్మేళనమే సీతామాత.

తపస్సపంన్నుడు, ఆదికవి యైన వాల్మీకి మహర్షి ఈ మహాకావ్యమును 'రామాయణము', 'సీతాచరితము', 'పౌలస్త్య వధ' అనే పేర్లతో రచించినట్లుగా శ్రీమద్రామాయణంలోని బాలకాండలోని నాల్గవ సర్గలో స్పష్టం చేయబడింది.

**కావ్యం రామాయణం కృత్స్నం సీతాయా పౌలస్త్యవధ మిత్యేవ చకార చరిత వ్రతం**. రామాయణము - రామస్య అయనమ్ రామాయణము. అంటే రాముని పొందేలాగా చేయునది. పరమాత్మను పొందేలా చేయాలి. ఇది ప్రాధాన్యంగా సీత కథ. రామాయాః అయనమ్ - రామాయణం. రామా అనగా స్త్రీ అనే అర్థం వున్నది. సీత కథ అంతర్యానికి జీవాత్మ కథ.

పౌలస్త్య వధ అంటే రావణ సంహారం. ఈ మూడు పాత్రల (రాముడు, సీత, రావణుడు) సమాహారమే రామాయణము.

**సీతాయాశ్చరితమ్ మహత్** - సీతమ్మ కరుణామయ గాధను వ్రాసి లోకానికి చాటాలని నిశ్చయించుకున్నాడు ఆది కవి వాల్మీకి మహర్షి. వాల్మీకి సీతారాములకు సమకాలీకుడు. నారద మహర్షి ఉపదేశించిన మహత్తర రామనామమే ఒక బోయవానిని మహర్షిగా మార్చినది. రామనామ ప్రభావమును స్వయంగా అనుభవించిన మహనీయుడు వాల్మీకి మహర్షి. ఈ భువిలో నదులు, గిరులు వున్నంత వరకూ రామాయణ గాధ నిత్యనూతనముగా శోభిల్లుతుందని చతుర్ముఖ బ్రహ్మ ప్రవచించినట్లు రామాయణ మహామాల అమర కావ్యకన్యగా, నిత్య నూతనంగా ప్రకాశిస్తూనే వుంటుంది. ఎప్పటికప్పుడు నవనవోన్మేషంగా ప్రకాశిస్తూ, ద్విగుణీకృతమైన శోభతో వర్థిల్లే రామాయణమునకు కేంద్రబిందువు సీతామహాలక్ష్మి. రామచరితమంతా

ప్రత్యక్షంగా, పరోక్షంగా సీతమ్మ తల్లి చుట్టూ పరిభ్రమిస్తుంది.

సీతమ్మతల్లి ఆవిర్భావం కూడా చాల అరుదైనది, అనుపమానమైనది. ఆమె అయోనిజ. పరమ ధార్మిక సంపన్నుడు, బ్రహ్మజ్ఞాని, మహావీరుడైన జనక మహారాజు మిథిలా నగరాన్ని రాజధానిగా చేసుకుని, పరిపాలించిన ఆదర్శగుణ సంపన్నుడు. ఆయనకు చాలా కాలము సంతానము కలుగలేదు. ఆయన లోక సంరక్షణార్థమై యజ్ఞం చేయదలచి, యజ్ఞ భూమిని దున్ని చదును చేస్తుండగా ఆ నాగేటిచాలు నుండి ఒక దివ్యమైన పాప కనబడింది. సంతానం లేని జనకమహారాజు నాగేటిచాలు నుండి ఉద్భవించిన దివ్యసౌందర్యరాశి, అమృత వర్షిణి తనకు భూదేవి ప్రసాదించిన మహాప్రసాదము, అమూల్య కానుకగా భావించి, నాగేటిచాలు నుండి ఉదయించిన ఆ అయోనిజకు 'సీత' అని నామకరణం చేసి, తన గుండెలకు హత్తుకున్నాడు.

అందానికి నిర్వచనమైన ఆ చిన్నారితల్లిని తల్లిదండ్రులిద్దరూ ఎంతో అపురూపంగా పెంచుకున్నారు. ఆమె సుగుణాల రాశి. తమిళంలో కంబరు మహాకవి సుగుణాలన్నీ ఆమెలో చేరితే తమకే ధన్యత లభిస్తుందని, ఒకదాని వెంట మరొకటి పరుగులు పెడుతూ సీతమ్మలో చేరి రాణించాయన్నాడు.

సీతమ్మతల్లికి యుక్తవయస్సు వచ్చింది. ఆణిముత్యం లాంటి అయోనిజకు అద్భుతమైన, అసమానమైన సౌందర్యంతోపాటు, ఆమెలోని సుగుణాలన్నీ దినదిన ప్రవర్థమానమై, ఆమె సౌందర్యంతో పోటీపడ్డాయి. అణుకువ, ఔదార్యము, ఆత్మాభిమానము, స్నేహశీలత్వము, చెలుల పట్ల చెలిమి, నిర్మల మైత్రీ భావము, ఆపదలో వున్నవారిని అక్కున చేర్చుకుని ఆదరించడము, లాలించడము, మృదు భాషిత్వము, మమతా స్వరూపిణియైన మైథిలి సహజాభరణములై, సర్వలక్షణ సమన్వితయైన సీతమ్మ తేజస్సును ఇనుమడింపజేశాయి.

- సశేషం

# శ్రీశ్రీశ్రీ బాబూజీ మహరాజ్‌వారితో అనుభవాలు

(గత సంచిక తరువాయి)

-వి. లక్ష్మీ నరసమాంబ

ఒకప్పుడు దశమి సందర్భంగానో, పున్నమి సందర్భంగానో హైదరాబాద్ ఆశ్రమంలో సత్సంగ సమావేశం జరిగింది. రాత్రి 9 గంటలకు బయటకు వచ్చి చూస్తే, ఎంత పెద్దవాన! ఎంత పెద్ద వానో లోపల ఉన్న మాకు తెలియలేదు. అప్పుడు వెలిసింది, బ్రతుకు జీవుడా! అని బాబూజీని తలుచుకుంటూ - అహమద్‌నగర్ నుండి అమీరపేట్‌కు పోవడానికి ఆటో దొరకగానే ఎక్కేశాను. రాత్రి 9 గంటలు అవడం వల్లనూ, వర్షం కురియడం వల్లనూ రోడ్డుమీద ట్రాఫిక్ పెద్దగా లేదు. ఆటో అతను త్వరగానే పంజాగుట్టలోని నాగార్జున సర్కిల్ దగ్గరకు తీసుకువచ్చాడు. అక్కడ, అప్పుడు ఫ్లైఓవర్ కడుతూ ఉన్నారు. అక్కడనుండి గ్రీన్‌లాండ్స్ మీదుగా అమీరుపేటలోని మా ఇంటికి వెళ్ళాలి. అయితే ఆటో డ్రైవరు-.

'అమ్మా! అటు ప్రదేశం అంతా నీటితో మునిగిపోయి ఉంటుంది. ట్రాఫిక్ ఆగిపోయింది. చూడండి! మిమ్మల్ని శ్రీనగర్ కాలనీ మీదుగా అమీరుపేట తీసుకుని వెళతాను' అన్నాడు . నాకు ఆ ప్రదేశాలు అన్నీ బాగా తెలియడం వల్ల 'సరే! కానియ్యి' అన్నాను. ఆ విధంగా చుట్టూ తిరిగి అమీరుపేట చందనా బ్రదర్స్ వెనక్కి వచ్చాము. అక్కడ అంతా జలమయం!.

'అమ్మా! మీరు ఆనీరు దాటి రోడ్డు ఎక్కి ఇంటికి పోవచ్చు!' అని చెప్పి అతను నన్నక్కడ వదలి పెట్టాడు. అక్కడ పావు గంట నిలుచున్న తరువాత గాని, నీటి ప్రవాహం తగ్గలేదు. ఆ తర్వాత నడుచుకుంటూ ఇల్లు చేరే సరికి సరిగా రాత్రి పదిన్నరయింది.

ఇంట్లో కొడుకు, కోడలు అంతకు ముందే వచ్చి ఉన్నారు. వారు వచ్చింది కూడా పంజాగుట్ట జంక్షను మీద నుంచే!.

ఇంకా కొద్దిసేపటికి టి.విలో వార్తలు వస్తున్నాయి. పంజాగుట్ట ఫ్లై ఓవర్ వర్షం తాకిడికి కొట్టుకు పోయింది. చాలా మంది చనిపోయారు అని. (ఒక వ్యక్తి మాత్రం చనిపోయినట్లుగా తరువాత నిర్ధారణ అయింది).

ఆ రోజు ఫ్లై ఓవర్ కూలిపోకముందే అదే దారిలో నా కొడుకు, కోడలు ప్రయాణం చేసి క్షేమంగా ఇల్లు చేరడం, నేను కూడా తరువాత, ఆ దారిన కాకుండా వేరే మార్గం గుండా ఇల్లు చేరడం అంతా బాబూజీ చలవే! అలా ఆయనే జరిపించారు అనుకుంటాను.

ఒకసారి మాతాజీగారు కూకట్‌పల్లిలో సత్సంగ సమావేశాలు జరిపేటందుకు హైదరాబాద్ ఆశ్రమానికి వచ్చారు. ఆ సందర్భంలో మా పిన్ని రూ.500/-లు ఇచ్చి 'బజారు నుంచి మాతాజీగారికి మంచి చీర తీసుకొనిరా' అని చెప్పింది. మంచి ముదురు రంగు, అంచుకలది, డిజైను లేనిది అయిన చీర తీసుకురమ్మన్నది. నేను చేనేత కొట్టుకు పోయి, మామిడి చిగురు రంగులో పట్టు అంచుగల నేత చీరను, కొంచెం డబ్బుకూడా వేసి తీసుకున్నాను. మందమతిని, ఇంకా మంచి చీర తీసుకునే అవకాశాన్ని పోగొట్టుకున్నాను. ఆ చీరను మా పిన్ని ఆ సాయింకాలమే నమస్కార సహితంగా అమ్మకి సమర్పించింది. నేనప్పుడు అనుకున్నాను, 'పిన్ని గొప్ప భక్తురాలే! కానీ ఆ చీర చాలా చవక అయినది. పట్టుచీరలు కట్టే అమ్మ చేనేత చీర కడతారా? తిరిగి ఎవరికో ఇచ్చేస్తారు'.

ఆ మర్నాడు సాయంకాలం కూకట్‌పల్లిలో ఒక గుడి ఆవరణలో సత్సంగ సమావేశం జరిగింది. చాలా మంది భక్తులు హాజరు అయ్యారు. సమావేశానంతరం, అందరూ అమ్మకి నమస్కారం చేసుకుంటున్నారు. నేను కూడా అమ్మకు దండం పెట్టడానికి ముందుకు వచ్చాను. అప్పుడు గమనించాను. ఆమె కట్టుకున్నది ఆ ముందురోజు పిన్ని ఇచ్చిన చీరనే! నేను కొట్టునుండి కొని తెచ్చినదే! ఇదెలా సాధ్యం? వారికి గల అనేక చీరలలో సరైన మేచింగ్ జాకెట్టు కూడా లేని ఈ చీర ఎలా కట్టుకున్నారు? కేవలం నా మనస్సులోని సందేహం తెలుసుకుని 'చీర ఖరీదు కాదు, ఇచ్చిన భక్తురాలి భక్తి ముఖ్యం' అని నాకు తెలియజెప్పడానికా?' ఆమెకు నమస్కరిస్తూ 'అమ్మా! ఆ చీర ... ఆ చీర...' అంటూ నుంచున్నాను. ఆమె నా వంక ఆశ్చర్యంగా చూస్తున్నారు. అంతలో వేరొక భక్తులకు చోటిస్తూ నేను ప్రక్కకు తొలగిపోయాను.

- సశేషం


నారాయణుడు
మధుప
ఈ సృష్టిలోని ప్రతి ప్రాణిలో నారాయణుడు ఉన్నాడు. అందుకే మనం అందరినీ, అన్నింటినీ గౌరవించాలి.
1


కొన్ని రోజుల తరువాత...
మీరు ముగ్గురూ బజారుకు వెళ్ళి సరుకులు తీసుకురండి.
2



అలాగే గురుదేవా!
3




తప్పుకోండి తప్పుకోండి! ఇది పిచ్చెక్కిన ఏనుగు!
4


మిత్రమా! ఆ ఏనుగు మనవైపే వస్తోంది. పద! పారిపోదాం.
5


మన గురువుగారు చెప్పింది మీరు వినలేదా? ఆ ఏనుగులో ఉన్నదీ, నాలో ఉన్నదీ ఒకే నారాయణుడు. నేనెందుకు భయపడాలి ?
6


హే నారాయణా! గురుదేవుల మాట విన్నందుకు ఫలితం ఇదా?
7
ఏం నాయనా! ఆ ఏనుగులో ఉన్న నారాయణుడే మరి ఆ మావటివానిలో కూడా ఉన్నాడు కదా! మరి ఆ మావటి నారాయణుని మాట నువ్వు ఎందుకు వినలేదు? గురుబోధను అర్థం చేసుకునే పద్ధతి ఇది కాదు. అందరిలో ఉన్న నారాయణుని గుర్తించి గౌరవించమన్నానే కానీ ఇలా మొండిగా ప్రవర్తించి ప్రాణాల మీదకు తెచ్చుకోమనలేదు కదా!
8

# కరోనా బోధించిన పాఠం

-పాలూరి కాళీప్రసాద్

ఈ రోజుల్లో కరోనా ప్రతి వారినీ భయ పెడుతోంది. అయితే మనకు నేర్చుకోవాలనే కోరిక వుండాలేగానీ, ఈ కరోనా మనకు ఎన్నో ఆధ్యాత్మిక విషయాలను కూడా నేర్పుతుంది.

ఈ కరోనా అనేది కంటితో చూడలేని సూక్ష్మ కణం. దానంతట దానికి స్వయంసత్తా లేదు. అయితే ఇది మన శరీరంలోని జీవకణాలతో కలిసిందంటే ఎన్నో లక్షల కోట్లరెట్లుగా వృద్ధి చెంది మన జీవ వ్యవస్థనే నిర్వీర్యం చేసేటంత శక్తిని పొందుతుంది. మన మనస్సులో జనించే సంకల్పాలు, బయట ప్రపంచం నుండి మనం పోగుచేసుకునే విషయాదులు, వాసనలు కూడా ఇటువంటివే. వాటికి విడిగా వునికి లేదు. కానీ, ఒక్కసారి మన మనసులోకి చోటిచ్చామంటే ఇక అవి తామర తంపరగా వద్ధిచెంది, చివరికి మనలను మానసికంగా నిర్వీర్యం చేసేటంత శక్తిని కూడా పొందుతాయి.

మరి ఈ కరోనా బారి నుండి తప్పించుకోవాలంటే మూడు ముఖ్యమైన నియమాలు పాటించవలసి వుంటుంది. అందులో మొదటిది భౌతిక దూరం. అంటే సమాజం లోని ఇతర వ్యక్తుల నుంచి వీలైనంత దూరంగా వుండటం.

భగవద్గీతలో కూడా శ్రీకృష్ణ పరమాత్మ **'అరతిర్జన సంసది'** - జన సమూహంలో వుండాలనే ఆసక్తి లేకపోవడం, ఇంకా లోతుగా వెడితే ప్రాపంచిక విషయాదుల యందు ఆసక్తి లేకపోవడం - జ్ఞానం యొక్క లక్షణాలలో ఒకటిగా నిర్వచించారు. ఊరికే పదిమందితో కలవాలనుకోవడం, పోసుకోలు కబుర్లు చెప్పడం, ఇక్కడ విషయాలు అక్కడ, అక్కడ విషయాలు ఇక్కడ చేరవేయడం - ఇవి అజ్ఞానుల లక్షణాలు.

జ్ఞాని ఎప్పుడూ తనలో తాను రమిస్తూ వుంటాడు. కానీ, బయట విషయాలు ఏవీ ఆయనకు ఆసక్తిని కలిగించవు. **'బాహ్యస్పర్శేష్వసక్తాత్మా విందత్యాత్మని యస్సుఖం'** - యోగి బాహ్య స్పర్శల యందు నిరాసక్తుడై తనలో తాను నిత్యం ఆనందాన్ని అనుభవిస్తూ వుంటాడని భగవద్గీత మనకు

బోధిస్తోంది. ఇదే విషయాన్ని ఇప్పుడు కరోనా మనకు ఆచరణపూర్వకంగా చూపిస్తోంది.

ఇక రెండవ నియమం జన సంపర్కం తప్పనప్పుడు మాస్కు ధరించడం. అంటే ఆ జనుల నుండి వెలువడిన వైరస్ మనలోకి ప్రవేశించకుండా ప్రధాన ద్వారాలైన ముక్కు, మూతి మూసుకుని వుండటం అన్నమాట. అలాగే ఆధ్యాత్మికంలో కూడా బయుట విషయాదులు మనలోకి ప్రవేశించే మన అయిదు జ్ఞానేంద్రియాలను ఆయా విషయాలకు వ్యతిరేక దిశలో లోపలికి ముడుచుకోవడం చాలా ముఖ్య కర్తవ్యం.

**యదా సంహరతే చాయం కూర్మోంగానీవ సర్వశః ఇంద్రియాణీంద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా'** - తాబేలు ఎలా అయితే శత్రువు అలికిడి వినపడగానే తన ఇంద్రియాలన్నింటినీ తనలోకి లాక్కుంటుందో, అలా తన జ్ఞానేంద్రియాలను వాటి వాటి ఇంద్రియార్థాలైన విషయాదుల నుండి వెనుకకు ఉపసంహరించుకోగలిగిన వాడే స్థితప్రజ్ఞుడు అని గీతావాక్యం.

ఇక ఈ రెండు నియమాలను ఎంత జాగ్రత్తగా పాటించినా ఏదో ఒక సందర్భంలో ఆ వైరస్ మన చేతులకు అంటుకునే ప్రమాదం ఎప్పుడూ పొంచి వుంటుంది కనుకనే మూడవ నియమంగా తరచూ చేతులను శుభ్రం చేసుకోమన్నారు.

అలాగే ఈ ప్రపంచంలో మనం ఎంత జాగ్రత్తగా వున్నా ఏదో ఒక రూపంలో ఆయా విషయాదులు మనకంట బడక మానవు. ఇక్కడ కన్ను అంటే కన్ను ఒకటే కాదు. ఇది అయిదు జ్ఞానేంద్రియాలకూ వర్తిస్తుంది. అయితే ఆ విషయాదులు మన మనసులో వాసనలాగ అంటుకుపోకుండా వుండాలంటే ఎప్పటికప్పుడు మన బుద్ధిని వుపయోగించి, విచారణ ద్వారా మనం వాటిని కడిగివేస్తూ వుండాలి.

కరోనాలాగే విషయాదులు కూడా చాలా జిడ్డువి. ఒకసారి పట్టుకున్నాయంటే అంత తేలికగా వదిలిపెట్టవు. అందుకే మాటిమాటికి ఎక్కువసేపు వాటిని విచారణ అనే సబ్బుతోనూ, ధ్యానాగ్ని అనే తీక్షణమైన శానిటైజర్‌తోనూ క్షాళన చేసుకుంటూ వుండవలసినదే.

- సశేషం

# మధురం మధురం మధురం

- విజయ రాఘవీయం

మధురం మధురం మధురం
మధురం మధురం సర్వం మధురం
మధురాధిపతే రఖిలం మధురం

నీ దర్శనం మధురం నీ స్పర్శనం మధురం
నీ భాషితం మధురం నీ హాసితం మధురం
మధురం మధురం సర్వం మధురం
మధురాధిపతే రఖిలం మధురం

నీ పలుకే మధురం నీ పిలుపే మధురం
నీ చూపే మధురం నీ రూపే మధురం
మధురం మధురం మధురం
మధురం మధురం సర్వం మధురం
మధురాధిపతే రఖిలం మధురం

నీ నడకే మధురం నీ నడతే మధురం
నీ చరణం మధురం నీ కరుణం మధురం
మధురం మధురం మధురం
మధురం మధురం సర్వం మధురం
మధురాధిపతే రఖిలం మధురం

యోగం మధురం భోగం మధురం
రాగం మధురం నీ అనురాగం మధురం
మధురం మధురం మధురం
మధురం మధురం సర్వం మధురం
మధురాధిపతే రఖిలం మధురం

శ్రీరాముని సౌశీల్యం సుందరం. నడక సౌందర్యం, నడత సౌందర్యం, రూపం సౌందర్యం, గుణం సౌందర్యం, మాట పలుకు సౌందర్యం, నిర్మల హృదయం అతి సుందరం.

మహారాజు దశరథుడు నిండు రాజసభలో గురువులు, మంత్రులు, మహాత్ములు, పౌరులందరి సమక్షంలో వారందరి ఆమోదంతో శ్రీరామునికి పట్టాభిషేకం చేయడానికి నిర్ణయించి, ఈ విషయం శ్రీరామునికి తెలియజేయడానికి సభకు శ్రీరాముని తీసుకుని రావలసినదిగా మంత్రి సుమంతులవారని ఆజ్ఞాపించాడు. తండ్రియైన మహారాజు ఆజ్ఞను శిరసావహించి, శ్రీరాముడు సామాన్య పౌరునివలె రాజు సమక్షానికి వచ్చి, రాజుకు నమస్కరించి, ఒక ప్రక్కగా నిలబడ్డాడు. మహారాజు తన తండ్రియే కదా అని చనువు చూపించలేదు. అది శ్రీరాముని సౌశీల్యం!

- సశేషం

### పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

**డిసెంబర్ 2020**

9 బుధ - శ్రీగురుదశమి. శ్రీబాబూజీ ఆరాధన. శ్రీసద్గురుపాదపూజ.

16 బుధ - శ్రీధనుర్మాస వ్రత ప్రారంభం.

25 బుధ - క్రిస్మస్, గీతాజయంతి, ముక్కోటి ఏకాదశి. శ్రీసద్గురు పాదపూజ

30 బుధ - మార్గశిర పౌర్ణమి, దత్తజయంతి - శ్రీ సద్గురుపాదపూజ.

**జనవరి 2021**

8 శుక్ర - శ్రీ గురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

13 బుధ - భోగి - శ్రీసద్గురుపాదపూజ రాత్రి 7గం.లకు శ్రీబాబుకు భోగిపండ్లు పోయుట.

14 గురు - సంక్రాంతి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

28 గురు - పుష్య పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

# శ్రీకృష్ణ జన్మాష్టమి

-సుషుమ్నా ప్రసాద

దశావతారములలో పరిపూర్ణ మానవులుగా అవతరించిన శ్రీరాముడు, శ్రీకృష్ణుడు అవి సంపూర్ణావతారములుగా పరిగణిస్తాము. అవతరించడమంటే దిగివచ్చుట అని అర్థం. విశ్వేశ్వరుడైన వైకుంఠ వాసుడు శ్రీమహావిష్ణువు దివి నుండి భువికి దిగిరావటమే అవతారము. ప్రతి అవతారమునకు ఒక ప్రత్యేకత, ఒక ఆవశ్యకత వున్నాయి.

శ్రీకృష్ణ పరమాత్మ గీతాచార్యునిగా భగవద్గీతలో శెలవిచ్చినట్లు **పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం। ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే॥** (భ.గీ 4/6). అంటే సజ్జనులను రక్షించడానికి, దుష్టులను శిక్షించడానికి, ధర్మ సంస్థాపన చేయడానికి ఆయా పరిస్థితులను బట్టి ప్రతి యుగంలో నేను అవతరిస్తూ వుంటాను.

త్రేతా యుగంలో శ్రీ మహావిష్ణువు దశరథ పుత్రుడై శ్రీరామచంద్రునిగా అవతరించారు. శ్రీరామునిది ధర్మ అవతారము. ఆదర్శ మానవుడు ఎలా జీవించాలో తన ప్రవర్తనతో నిరూపించాడు శ్రీరామచంద్రుడు. ఇక్ష్వాకు వంశ తిలకమైన శ్రీరామచంద్రుడు ఎలాంటి మహిమలను ప్రదర్శించలేదు. **శ్రీరామ రక్షే సర్వజగద్రక్ష.**

ద్వాపర యుగంలో అవతరించిన శ్రీకృష్ణ పరమాత్మది మహిమావతారము. మాయావతారము. మాయ మహిమలతో మానవాళి సముద్ధరణకై మానవ రూపంలో మదన గోపాలునిగా అవతరించి, మురళీకృష్ణుడుగా మురిపించాడు. అవతరించక ముందే అద్భుతాలను ప్రదర్శించిన అసమాన ప్రజ్ఞాశాలి. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణకై ప్రేమయే అవతారముగా దిగివచ్చి మానవాళి మనసులను దోచుకున్న మాయావి.

తాను అవతరించడానికి 10 సంవత్సరాల ముందే రాక్షస ప్రవృత్తిగల కంసుని గుండెల్లో రైళ్ళు పరుగెత్తించాడు. శాంతి అనేది లేకుండా చేశాడు. అది మానవమాత్రుడు చేయగల కార్యం కాదు.

కంస మహారాజు తన ప్రియసోదరి దేవకీదేవిని వివాహానంతరం ఆమెను మెట్టినింటికి పంపడానికి నూతన వధూవరులైన దేవకీదేవి, వసుదేవులను రథారూఢలను చేసి, తానే స్వయంగా సారథ్యం

వహించాడు. అలా సారథ్యం వహించి ఆనందంలో ఓలలాడుతున్న తరుణంలో, అదృశ్యవాణి వినిపించింది. 'కంసా! ఆనందంతో పొంగి పోవద్దు. నీ సోదరికి అష్టమ గర్భాన జన్మించే అష్టమ పుత్రుడు నిన్ను హతమారుస్తాడు' అని చెప్పింది. అది వినిన వెంటనే హింసకు ప్రతిరూపమైన కంసునిలో అనూహ్యమైన మార్పు వచ్చింది. విన్నది ఆకాశవాణి యైనా పూర్వాపరాలు మరచిపోయాడు. మరణ భయంతో మానసిక స్థిరత్వాన్ని కోల్పోయాడు.

భగవానుడు ఆకాశవాణి రూపంలో కంసునికి ఒక పరీక్ష పెట్టాడు. ఆ పరీక్షలో కంసుడు పూర్తిగా పరాజితుడయ్యాడు. జన్మించిన ప్రతి వ్యక్తి మరణించడమనేది జగమెరిగిన సత్యమని విస్మరించాడు. అష్టమ గర్భ జనితుడు తనను సంహరిస్తాడంటే సుమారు పది సంవత్సరాల కాలవ్యవధి వుంది. అంటే ఈ దశాబ్దంలో తన దశను దిశను మార్చుకొని, జన్మరాహిత్యాన్ని పొంది, భగవదైక్యతను పొందటానికి అమూల్య అవకాశము లభించింది. తన జీవితాన్ని తరింపజేసుకోవచ్చు.

ఏడురోజులలో మరణిస్తావని పరీక్షన్మహారాజుకు ముని శాపమిస్తే పరీక్షిత్తు కించిత్తైనా చలించలేదు. మరణ సమయం తెలియడం ఒక మహదవకాశంగా ఆనందించాడు. ఈ ఏడు రోజులలో ఏడు క్షణాలు కూడా ఆయన తన మరణాన్ని గురించి ఆలోచించలేదు. ఈ ఏడు రోజులలో శుకమహర్షిచేత భాగవత సప్తాహానికి నాంది పలికి, భాగవతోత్తముడిగా, చిరంజీవిగా ప్రకాశిస్తున్నాడు. అలా పరీక్షిన్మహారాజు మరణమనే పరీక్షలో విశ్వవిజేతగా ప్రకాశిస్తున్నాడు.

కాని కంసుడు అందుకు విరుద్ధంగా తన శేష జీవితంలో క్షణ క్షణమూ మరణ భయంతో, మరణ కబంధ హస్తాలకు బానిసయై, జీవించిన ప్రతి క్షణమూ మరణించాడు. అంతా కృష్ణ మహిమే!

- సశేషం

# శ్రీబాబు దివ్యవాణి

(గత సంచిక తరువాయి) - డా॥ రాఘవేంద్ర. పరుచూరి

దశేంద్రియాలకు శాంతినిచ్చేటటువంటిది రామసందర్శనము. అందుకే ఆయనకు 'పుంసాం మోహన రూపాయ' అనే సార్థక నామం కలదు. స్త్రీ పురుషులందరికీ మోహాన్ని కలిగించేది ఆయన రూపం. సర్వ ప్రకృతి ఆయన్ని చేరాలని తహతహలాడిందిట. మీ ఇంద్రియ సుఖాలకంటే రామనామం ఎక్కువ ఆనందాన్ని ఇస్తుంది. మన జితేంద్రియుడు 'రాం' అనేటప్పటికి ఆ ఏకాక్షరము, ప్రణవము మనస్సుకు కావలసిన ఆనందాన్ని ఇచ్చింది. ఆయన మనస్సు ఇక నిలబడిపోయింది. జ్ఞాని అయినవాడు ఏం చేస్తాడు? మనస్సును రామనామం దగ్గరకు చేరుస్తాడు. అప్పుడు మనస్సు రామ నామంలో కరిగిపోతుంది. హాయిగా నిలబడిపోయి, ఆ తారక బ్రహ్మ రూపాన్నే పొందుతుంది. అదే సమాధి స్థితి అంటే. కోతిగా వున్న జీవత్వం నశించి, జితేంద్రియుడయ్యాడు హనుమ. నీ స్వరూపాన్ని సందర్శింప చేసేదే తారక నామము. నా రామ పాదుకలు ఎవరి హృదయమందు సాక్షాత్కరించుకుంటారో వారు అద్వైత స్థితిని పొందుతారు. 'ప్రజ్ఞానం బ్రహ్మ' ఇది వేదవాక్కు, మహా వాక్యము. 'స్థావర జంగమములు నా యందే వున్నవి, ఇక కదిలేందుకు స్థానమెక్కడున్నది? సర్వవ్యాపకమైన తారక బ్రహ్మము అంతటా నిండి వున్నది. నేను సదా ఆనంద స్వరూపుడను. మనస్సు దానియందు వుండబట్టే సర్వం హరించి పోయాయి. హరింపజేసేది హరినామ స్మరణే - అని అనుభవపూర్వకంగా తెలుసుకోవాలి. ఇది గ్రంథాలు చదివితే రాదు.

ఏ ఇంద్రియానికి కూడా కానరాని సూక్ష్మాతి సూక్ష్మమేదైతే వున్నదో దాని యందు కూడా నేనే నిండి వున్నాను - అనే ఆత్మజ్ఞానాన్ని అనుభవపూర్వకంగా ఈ శరీరంతోనే పొందాలి. రామనామమును ధ్యానిస్తే జీవభ్రాంతి తొలగిస్తుంది. ఈశ్వరుడవు నీవని తెలుసుకుంటావు. నీ స్వరూపాన్ని నీవని తెలుసుకోకుండా అడ్డుగా వున్న అహంకార మమకార పొరలు వాటంతట అవే పచ్చిగా వుంటే రాలవు. పొరలతో వున్న బియ్యపు గింజ (వడ్ల గింజ) నాటితే మొలుస్తుంది. అదే పొరలు వూడిన బియ్యపు గింజ నాటితే మొలక రాదు. అలాగే అహంకార మమకారాలు తొలగిపోతే ఇక పునర్జన్మ వుండదు. అహంకార మమకారాలు తొలగి నీ స్వరూపాన్ని దర్శించాలి. ఎవరు నీవు? తారక బ్రహ్మం నీవు, ఇదేదీ కాని ఈశ్వరుడవు నీవు. అటువంటి స్థితిని పొందింప జేసేటటువంటిది రామనామము.

- సశేషం

# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి) - రేఖ

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామివారు కూడా తమ బోధలలో 'సృష్టిని మార్చలేము, దృష్టిని మార్చుకోగలము' అని చెబుతూ వుండేవారు. ఎప్పటికప్పుడు వివేకదృష్టిని కలిగి, మన పరిధిలో, మన హద్దులలో మనం వుంటూ, అన్నీ వున్నా, ప్రపంచంలో వైరాగ్యదృష్టితో వుండాలి. జనకుడు మహారాజు అయివుండి కూడా ఆయన ఆత్మ విద్యకు అర్హుడు ఎలా అయ్యాడు? వైరాగ్య పురుషుడు అయి, నిత్యమూ ఆత్మజ్ఞానంతో ప్రకాశిస్తూ వున్నారు. కారణం ఏమిటి? రాజ్యం ఏలకుండా లేరు. రాజ్య భోగాలలో నిత్యమూ తులతూగుతూ వుండిపోతే, ఈనాడు మనం రోజూ చదివే గీతామహాత్మ్యంలో **భూభుజో జనకాదయః** అని జ్ఞానం గురించి తలచుకున్నప్పుడు వారిని గురించి చదువుకుంటామా? జనకమహారాజు ప్రపంచంలో వున్నా, ఆయనలోకి ప్రపంచం రానీయలేదు. మనం కూడా ఆవిధంగా వుండాలి.

14వ మంత్రంలో జాగ్రదావస్థలో జీవుడిలోని ఆత్మ విశ్వుడుగాను, స్వప్నావస్థలో తైజసుడుగాను, సుషుప్తావస్థలో ప్రాజ్ఞుడుగాను వుంటూ సాక్షిగా వ్యవహరిస్తున్నాడు.

15వ మంత్రంలో ఈ ఆత్మ నుండే ప్రాణము, మనస్సు, సర్వేంద్రియాలు, ఆకాశము, వాయువు, అగ్ని, నీరు, విశ్వమును ధరించే భూమి అన్నీ కూడా ఉద్భవించాయి. మనస్సు అంతరేంద్రియాలకు సంబంధించినది. (మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము).

నారాయణోపనిషత్తులో కూడా ఈ సమస్తమూ కూడా నారాయణుడి నుండి ఉద్భవించినట్లు చెప్పబడింది. ఈ ఉపనిషత్తులో ఆత్మ నుంచి వచ్చాయి అని ఆత్మవిద్య గురించి చెబుతున్నప్పుడు, సర్వవ్యాపకమైనప్పుడు ఆ నారాయణుడే ఆత్మశక్తిగా, ఒక పవర్‌గా వుండి, దీని నుండే ఒక అనంతశక్తి నుండి ప్రాణము, ఇంద్రియాలు, పంచమహాభూతాలు అన్నీ వచ్చాయి. అన్నిటికీ మనకు కూడా ఆధారం ఆ ఆత్మశక్తియే.

ఇదే మంత్రం ముండకోపనిషత్తులో కూడా చెప్పబడింది. అన్నీ దేనినుండి ఉద్భవించాయో, అటువంటి ఉపాదానకారణమే అన్ని

కార్యాలకు ఆధారం. ఉపాదానకారణం అంటే వీటన్నిటికి కారణం ఆత్మయే. ఆధారం ఆత్మయే. మనకు అంతఃకరణ, జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు వున్నాయి. అంటే అవి ఏవీ కూడా మన అమ్మనాన్నల నుండి రాలేదు. మనకీ, మన అమ్మనాన్నలకూ కూడా ఆధారం ఆ ఆత్మయే.

ప్రాణం వుంటేనే ఈ దేహంలో సమస్త క్రియలూ జరుగుతాయి. బాహ్యవిషయాలను గ్రహించటం, వాటికి తగిన విధంగా ప్రతిక్రియలు చేయటం అనే కార్యాలు, మనస్సు జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాల ద్వారా జరుగుతాయి. అన్నిటికీ కూడా ఆత్మయే ఉపాదానకారణం.

బంగారం - ఆభరణాలు. బంగారు ముద్దను ఎన్ని రకాల ఆభరణాలుగానైనా మార్చుకోవచ్చు. కానీ అవి తయారు చేయబడిన తరువాత దానిని బంగారం అనము. గాజుఅనో, నెక్లస్ అనో, పోగులు అనో అంటాము. ఆభరణాలు నిమిత్తకారణాలు.

మనకి కూడా ఆత్మయే ఆధారం. ఉపాదాన కారణం. మన దేహం నిమిత్త కారణం. ప్రాణం వుంటేనే, జీవించి వుంటేనే, ఇంద్రియాలు, మనోబుద్ధులు శక్తిగలిగి అనుభవ క్షేత్రంలో వ్యవహరించగలవు. ఇంద్రియాలు విషయ క్షేత్రంలో, మనస్సు సంకల్ప వికల్పాలలో, బుద్ధి ఆలోచనా క్షేత్రంలో ఆ ఇంద్రియాలు వ్యవహరించగలవు.

సరియైన బాట లేనప్పుడు మోటార్‌కారు, నీళ్ళు లేని ఎడారిలో ఒక నావ, చెవిటివానికి గానము, గ్రుడ్డి వానికి శాస్త్ర గ్రంథాలు వ్యర్థమే కదా! అవన్నీ వాటివాటి పనులు అవి చేయడానికి సరియైన క్షేత్రాలు లేకపోవడం వలన అవి నిరుపయోగమవుతున్నాయి.

పరమ ఆధారమైన పరమాత్మలో నుండి వచ్చిన ఈ సజీవ దేహమనోబుద్ధులు అనుభూతులను పొందాలంటే అనంతమైన అనుభవాలను అందించే అనుకూలమైన క్షేత్రమొకటి తప్పనిసరిగా వుండి తీరాలి. ఆ పరమాత్మ నుండి వచ్చిన పంచమహాభూతాలు చేరి, విషయ ప్రపంచంగా అనగా క్షేత్రంగా రూపొందాయి. పంచ భూతాల యొక్క పరస్పర సమ్మేళనం పంచతన్మాత్రలు, సమస్త విషయ ప్రపంచం ఇవన్నీ మనస్సులోని భావాలను, బుద్ధిలోని ఆలోచనలను తీర్చిదిద్దడానికి కాలవసిన సాధన సామాగ్రిగా వున్నాయి.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**డిసెంబర్ 2020**

3  గురు - శ్రీగురుదేవులు స్వస్వరూపలయం పొందిన తేదీ.

3 గురు - 9 బుధ వరకు శ్రీ సద్గురుదేవుల ఆరాధనా మహోత్సవాలు.

9 బుధ - శ్రీగురుదశమి, శ్రీ సద్గురు పాదపూజ, దీపోత్సవం, ఆరాధన.

10 గురు- శ్రీసద్గురుదేవుల మహాభిషేకము. శ్రీ సద్గురు మండల దీక్షలో పాల్గొన్నవారికి  హోమం పూర్ణాహుతి, దీక్ష విరమణ.

12 శని - శని త్రయోదశి

13 ఆది - మాసశివరాత్రి

14 సోమ - అమావాస్య.

16 బుధ - శ్రీధనుర్మాస వ్రత ప్రారంభం.

20 ఆది - శ్రీసుబ్రహ్మణ్య షష్ఠి.

25 బుధ - క్రిస్టమస్, ముక్కోటిఏకాదశి  మరియు గీతాజయంతి. ఉత్తరద్వార దర్శనం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

30 బుధ - మార్గశిర పౌర్ణమి, దత్తజయంతి  - శ్రీ సద్గురుపాదపూజ.

**జనవరి 2021**

1  శుక్ర  - ఆంగ్ల సంవత్సరాది. శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

8 శుక్ర - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

11 సోమ - మాస శివరాత్రి

13 బుధ- అమావాస్య, భోగి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన. రాత్రి 7గం.లకు శ్రీబాబుకు భోగిపండ్లు పోయుట.

14 గురు - సంక్రాంతి - ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

15 శుక్ర - కనుమ.

28 గురు - పుష్య పూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ.

# పదినామాలవాడు

- భోగరాజు భారతీదేవి

మహాభారతంలో అసంఖ్యాకమైన పాత్రలు వున్నాయి. వారిలో కొందరికి ఒకటి కంటే ఎక్కువ పేర్లు వున్నాయి. భీష్మపితామహుడికి చాలా పేర్లు వున్నాయి. అర్జునుడికి పది పేర్లు వున్నాయి. ఉరుములు, మెరుపులు, పిడుగులతో వర్షం కురుస్తూ వాతావరణం భయంకరంగా వుంటే, 'అర్జున! ఫల్గుణ! పార్థ! కిరీటి! ......' అనే పేర్లు స్మరిస్తే పిడుగుల భయం తొలగి, ప్రశాంత వాతావరణం ఏర్పడుతుందని వెనకటి తరాల పెద్దలు చెప్పేవారు. అలా చేసేవారు కూడా. అది ఒక నమ్మకం. ఈ తరాలవారికి అసలు అది తెలియని విషయం.

పాండవులు విరాటుడి కొలువులో అజ్ఞాతవాసం చేస్తున్నప్పుడు ఉత్తర గోగ్రహణ సందర్భంగా అర్జునుడు కౌరవులతో యుద్ధానికి సన్నద్ధమయ్యాడు. జమ్మిచెట్టు మీద నుండి బాణాలు తీస్తూ, తను అర్జునుడనే నమ్మకం ఉత్తరకుమారుడికి కలిగించే ప్రయత్నంలో అతడు పాండవ మధ్యముడి పదిపేర్లు చెప్పమంటే తానే స్వయంగా చెబుతాడు. ఆ పేర్ల సార్థక్యాన్ని కూడా వివరించాడు. అవి... 'అర్జునుడు, ఫల్గుణుడు, పార్థుడు, కిరీటి, శ్వేతవాహనుడు, భీభత్సుడు, విజయుడు, జిష్ణుడు, సవ్యసాచి, ధనంజయుడు' అనే పేర్లు.

అర్జున అంటే తెల్లని వర్ణమని అర్థం. అర్జునుడు తెల్లగా వుంటాడు. అది నిర్మల వర్ణం. మొత్తం భూమిపై అతనితో సమానమైన వర్ణం దుర్లభం, అతను పరిశుద్ధమైన పని చేస్తాడు, అందుకే అతనిని **అర్జునుడు** అంటారు.

అర్జునుడు ఉత్తర ఫల్గుణి, పూర్వ ఫల్గుణి నక్షత్రాల మధ్య కాలంలో పుట్టాడు. అందువలన **ఫల్గుణుడు** అయ్యాడు.

కుంతీదేవికి పృథ అనే పేరున్నది. ఆమెకు కలిగిన సంతానంలో అర్జునుడు చివరివాడవడం వల్ల అతను **పార్థుడు** అయ్యాడు.

ఇంద్రుడు అర్జునుడి పరాక్రమాన్ని మెచ్చుకుని ఇచ్చిన కిరీటం యుద్ధంలో ఎప్పుడూ అతని శిరస్సుపై ప్రకాశిస్తూ వుంటుంది. ఆ కిరీటం అభేద్యం, సుస్థిరము. అందుకే **కిరీటి** అనే పేరు వచ్చింది.

యుద్ధరంగంలో అర్జునుడు ఎప్పుడూ తన రథాలకు తెల్లని గుఱ్ఱాలనే కడతాడు. అందుకే అతనికి **శ్వేతవాహనుడు** అనే పేరు వచ్చింది.

యుద్ధరంగంలో శత్రువులను చీల్చి చెండాడతాడు. చూసేవారికి ఒళ్ళు జలదరించేలాగా చేస్తాడు. అటువంటి భయంకర దృశ్యాలను సృష్టిస్తాడు. కనుకనే **భీభత్సుడు** అనే పేరు కలిగింది.

ఎంతటి బలవంతలు యుద్ధంలో తనను ఎదిరించినా వారిపై యుద్ధంలో విజయాన్ని సాధిస్తాడు. అందుకే **విజయుడు** అంటారు.

అర్జునుడు చూస్తుండగా ఎవరైనా ధర్మరాజు శరీరానికి యుద్ధంలో గాయాన్ని కలిగిస్తే వాళ్ళని హతమారుస్తాడు. కనుక **జిష్ణుడు** అంటారు.

యుద్ధ రంగంలో ఏ చేతితోనైనా అల్లెతాటిని లాగగలడు. కానీ లాగడంలో ఎడమచేతి వాటం తీవ్రంగా వుంటుంది. అందువలన **సవ్యసాచి** అయ్యాడు.

పరాజితులైన రాజుల నుండి అపారమైన ధనం పొందటం వలన **ధనంజయుడు** గా ప్రసిద్ధి చెందాడు.

ఖాండవ దహన సమయంలో శివుడు, బ్రహ్మ ప్రత్యక్షమై అర్జునుడికి కృష్ణుడు అనే నామధేయాన్ని ప్రసాదించి దివ్యాస్త్రాలు ఇచ్చారు. ఈ విధంగా 11పేర్లు వచ్చినా కూడా అర్జునుడికి పైన చెప్పిన పది పేర్లే ప్రసిద్ధమయ్యాయి.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా డిసెంబర్ 2020, జనవరి 2021 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***డిసెంబర్ 2020 :*** AS 7195, 7198, 7199, 7200, 7418, 7626, 8491, 8493 - 8499

***జనవరి 2021 :*** AS 6169, 6990, 7000, 7217, 7218, 7420, 7987, 8505, 8509, 8510, 8512, 6373, 7208. 5127, 8517.

# రాణి రాసమణి

సేకరణ - మురళి

1793లో సెప్టెంబర్28 న, పశ్చిమ బెంగాల్ లోని కోన గ్రామంలో రాసమణి జన్మించారు. తండ్రి హరేకృష్ణ దాస్. తల్లి రామప్రియ దేవి. రాసమణి బాల్యంలోనే ఆమె తల్లి గతించారు. ఆమెకు 11సం.ల వయస్సు లోనే కలకత్తా జాన్ బజారు జమీందారు శ్రీబాబు చంద్రదాస్‌తో వివాహం జరిగింది. 1836వ సంవత్సరంలో భర్త మరణానంతరం రాసమణి జమీందారి బాధ్యతలు చేపట్టి ఎంతో సమర్థవంతంగా నడిపించారు. రాసమణి బాల్యం నుండి దయా స్వభావం కలిగిన వారగుటచే భక్తిభావం కలిగి వుండి, బీదవారికి ఆశ్రయాన్ని కల్పిస్తూ, ప్రజలను ప్రేమగా చూసేవారు.

రాణి రాసమణి ఎంత జమీందారు అయినప్పటికీ అహంకారం మచ్చుకైనా వుండేది కాదు. బీదలకు అండగా నిలిచేవారు. వారికి ఏదైనా అన్యాయం జరిగితే బ్రిటీష్ ప్రభుత్వంతో ధైర్యంగా పోరాడి, వారికి న్యాయం జరిగేలా చేసిన మహారాణి. సుగుణాలరాశి, దేవీ భక్తురాలు. ఒకరోజు జగన్మాత కలలో దర్శనమిచ్చి తనకు ఒక ఆలయం నిర్మిస్తే, తాను సజీవంగా అక్కడ కొలువై వుంటానని చెప్పడంతో రాసమణి అమిత ఆనందంతో కలకత్తాకు 10 కి.మీ దూరంలో భవతారిణీ కాళీమాత ఆలయం నిర్మింపజేశారు. అదే శ్రీరామకృష్ణ పరమహంసవారు శ్రీకాళీ మాతను ఆరాధించి, సాక్షాత్కారం పొందిన దక్షిణేశ్వర ఆలయం. రాణి కోరికపై రామకృష్ణుల అన్నగారైన రామ్ కుమార్ 31-5-1855 న ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఆ సమయంలోనే రాణి నిత్య నైవేద్యం, నిర్వహణ నిమిత్తం ఒక పెద్ద పరగణా దానం చేసి, దేవస్థానానికి వనరులను చేకూర్చారు. జగన్మాత ప్రతిష్ఠ సమయంలో సాధువులు, సాధారణ ప్రజలతోపాటు వేదపండితులు, బ్రాహ్మణులకు కూడా ఘుమ ఘుమలాడే ప్రసాదాలతోపాటు, వస్త్రదానం కూడా చేసి, అందరినీ సంతోషపరిచారు.

కాలక్రమేణా ఈ ఆలయంలో పూజలు నిష్ఠతో చేయడంతోపాటు వచ్చిన భక్తులను ఆదరించి దర్శనము, అన్నదానము జరుగుతూ వుండటం వలన నిత్యం అనేకమంది భక్తులు, సాధుసంతులు

వస్తుండేవారు. రామ్ కుమార్ కొలది కాలంలోనే బ్రహ్మైక్యం చెందటంతో ఆ బాధ్యతలను శ్రీరామకృష్ణులకు అప్పగించారు. రాసమణీదేవి అల్లుడు మధురబాబు జమీందారి వ్యవహారలలో రాణీకి అండగా వుండటమేకాక, రామకృష్ణులకు కూడా ఎంతో సహాయంగా వుండేవారు.

రాసమణి చేసే సేవలను సహాయాలను ప్రజలు కథలు కథలుగా చెప్పుకొనేవారు. ఒకసారి బ్రిటీష్ ప్రభుత్వంవారు నదిలో చేపలు పట్టుకునే వారిపై సుంకం విధించడంతో వారు జీవనోపాధిని కోల్పోయారు. రాణి దానిని వ్యతిరేకించి, పోరాటం సలిపి, నదిలో రవాణా సౌకర్యాలను అడ్డుకోవడంతో బ్రిటీష్ ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. హిందువుల ఊరేగింపులను శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నాయనే మిషతో బ్రిటీష్ ప్రభుత్వం అడ్డుకున్నప్పుడు రాణి దానిని వ్యతిరేకించారు. ప్రజలలో వచ్చిన తిరుగుబాటుకు తలవంచి ఎత్తివేయవలసి వచ్చింది.

రాసమణీ దేవి ఎన్నో ధార్మిక కార్యక్రమాలు కూడా చేపట్టారు. గంగానదిలో స్నానఘట్టాలు నిర్మింపజేశారు. సువర్ణరేఖ నది నుంచి పూరీ వెళ్ళడానికి రహదారి నిర్మింపజేశారు. కలకత్తాలోని నేషనల్ లైబ్రరీ, ప్రెసిడెన్సీ విశ్వవిద్యాలయాలకు స్థలం దానం చేశారు. వారి జమీందారీ లోని దట్టమైన అడవులలో నివశించే ఆదివాసులు దొంగతనాలకు పాల్పడుతుంటే వారిని చేపలు పెంచుకునే వృత్తి స్వీకరించమని ప్రోత్సహించి, సహాయం చేయడంతో వారు ఆ వృత్తిని చేపట్టి ఎంతో ధనవంతులయి దొంగతనాలు మానివేశారు.

ఈ విధంగా తన జీవితాన్ని భగవత్సేవకు, భాగవతుల సేవకు, దీనజనుల సేవకు అంకితం చేసుకున్న రాణి రాసమణి 1861సం. ఫిబ్రవరి19 వ తేదీన భవతారిణి మాతలో లీనమయ్యారు. ఇట్టి సౌశీల్యవంతులు ప్రాతఃస్మరణీయులు కదా!!

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

## శ్రీహరిరావు గారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

26-11-1959: శ్రీ బాబు భవానమ్మగారి కుటుంబ సభ్యులతో పెద్ద తిరుపతి వెళ్ళి రెండు వారాలుండి తిరిగి వచ్చారు. శ్రీహరిగారింట్లో పిల్లలతో కబుర్లు చెబుతూ ఒక తెల్ల కాగితాల పుస్తకం తెప్పించి , దాంట్లో ఇంగ్లీషులో ఏదో వ్రాశారు. పెద్ద పెద్ద అక్షరాలతో వ్రాస్తేనే తనకిష్టమని చెప్పారు. ఆ వ్రాసిన దానికి అర్థమేమిటి అనడిగితే "వికసించే హృదయాలలో విజ్ఞాన జ్యోతిని వెలిగించుట" అన్నారు. (ఈ అధ్యాయం చివరలో ఉన్న చిత్రపటం చూడండి)



27-11-1959: ఒకసారి శ్రీహరి గారింట్లో శ్రీ బాబు ఉన్నపుడు బందా తాతయ్యగారు వచ్చారు. "ఇవాళ మనం యీ వృద్ధ పండితులతో తత్త్వ విచారణ చేసుకుందాం. వంటలు వార్పులు వద్దు. హొటలు నుంచి క్యారియరు తెప్పించు కుందాము" అని శ్రీ బాబు సద్గోష్ఠి జరిపి, హొటలు నుంచి క్యారియర్ తెప్పించి అందరితో కలిసి భోజనం చేశారు.

ఇంటివారి పాప వచ్చి శ్రీ బాబు ఒడిలో కూర్చుని "కృష్ణలీలలు సినిమా చూశా" నని చెప్పింది. ఆ కథంతా పాపతో చెప్పించుకున్నారు. "కృష్ణుడంటే నీకిష్టమేనా?" అని శ్రీ బాబు అడిగితే, ఆ పాప "చాలా యిష్టం! నేను వాణ్ణే పెళ్ళి చేసుకుంటాను" అన్నది. శ్రీ బాబు నవ్వుతూ "అలాగే చేసుకో! కాని వాడసలే మోసగాడమ్మా! చెప్పకుండా పెట్టకుండా ఎప్పుడు పడితే అప్పుడు నిన్ను విడిచి ఎక్కడకో వెళ్ళిపోతూ ఉంటాడు. నువ్వు చాలా జాగ్రత్తగా ఉండాలి సుమా! ఓ పని చెయ్యి. వాణ్ణి నీ హృదయంలో బంధించుకో. అప్పుడు వాడు ఎటూ పారిపోవటానికి లేకుండా నీ హృదయంలోనే ఉండిపోతాడు. వాడి కోసం నువ్వు, నీ కోసం వాడు బెంగ పెట్టుకోకుండా ఉండాలంటే, వాడే నువ్వు, నువ్వే వాడు అయిపోవాలి" అన్నారు.

శ్రీ బాబు వెళ్ళిపోదామని, పాపను ఒడిలో నుంచి దింపేశారు.

పాప శ్రీ బాబు చెయ్యి గట్టిగా పట్టుకుని బ్రతిమాలుతున్నట్లుగా "మళ్ళీ తప్పకుండా రండి" అన్నది. శ్రీ బాబు "రాకేం చేస్తాను? నువ్వు నన్ను అలా కట్టేసుకున్నావుగా మరి? నేను కూడా మా అమ్మని అలాగే నా గుండెల్లోనే కట్టేసుకున్నాను. అమ్మ ఎంత బావుంటుందో తెలుసా? చక్కగా ముత్యాల రవికె వేసుకుంటుంది. ఒళ్ళంతా ముత్యాలే. ఇంకా పచ్చలు, కెంపులు, రత్నాలు ఎన్నో నగలున్నాయి తెలుసా మా అమ్మకి? అమ్మ నాకు ముస్తాబు చేసేటప్పుడు అవన్నీ నాకు కూడా పెడుతుంది" అన్నారు.

28-11-1959: 3వ తేదీ నుండి సామర్లకోటలో వైద్యం కోసం వెళ్ళి వుంటానని శ్రీ బాబు చెప్పారు. "మిమ్మల్ని వదిలి ఉండాలంటే బెంగగా ఉంటుంది బాబూ!" అని శ్రీహరిగారూ వాళ్ళూ అంటే, శ్రీ బాబు "నాకు కూడా మిమ్మల్ని చూడకపోతే అలాగే ఉంటుంది. అందుకనే నన్ను నమ్ముకున్న వాళ్ళందరిని నా హృదయంలోనే పెట్టుకున్నాను. అలాగే మీరు కూడా నన్ను మీ హృదయాలలో నిలుపుకుని 'హృదయ బాబు' గా చేసుకుంటే యిక బెంగ అనేదే ఉండదు" అన్నారు. "కరుణాపయోనిథీ" అన్నమాటలో ఎంతో అర్థం ఉన్నది. నిర్హేతుక దయ, ప్రేమ అనే క్షీరంతో మీ హృదయం నింపుకుంటే ఆ క్షీరసాగరంలోనే మీరు నమ్ముకున్న లక్ష్మీనారాయణుడుంటాడు. ఆయన మీ పై  సదా అపారము, అహేతుకము అయిన ప్రేమామృతమును వర్షిస్తూనే ఉంటాడు" అని చెప్పారు.

15-2-1960: శ్రీ బాబు ఏలూరు వచ్చారు. శ్రీహరిగారింట్లో ఉన్న క్యాలెండరు చూపిస్తూ 'శ్రీ కృష్ణ ప్రభువు మురళి చేత్తో పట్టుకొని ఎటో చూస్తూ' ఏదో ఆలోచిస్తున్నట్లున్నాడు కదూ? 'ఈ మాయ ప్రపంచాన్ని ఏం చేద్దామా' అనేమో? దానికేముంది? 'మాయ ప్రపంచం' లోని 'మాయ' ను ఆయన తీసివేస్తే, ప్రపంచం  అదే మాయమైపోతుంది. అప్పుడు అన్ని చోట్లా , ఎప్పుడూ వాడే ఉంటాడు. మీరు 'బాబు ఎక్కడో ఉన్నారు. మమల్ని మరచిపోయారు' అనుకుంటున్నారు. మరపే మాయ. అది నాకు లేదు. నేను ఎల్లప్పుడూ అన్నీ చూస్తూనే ఉంటాను. అలాగే మిమ్మల్నీ చూసుకుంటాను. బెంగపడకండి" అన్నారు.

-సశేషం

## విష్ణు  కథలు

# అవదూత పిచ్చమ్మ

-రమణ ప్రసాద్

'దేవుణ్ణి ఎవరు చూపిస్తాడు రా? ఎవడు చూపించగలడు? దేవుణ్ణి చూడాలనే కోరిక లోపలనుండి ఏరల్లే పొంగిపొర్లి రావాలిరా!"

"వీడికి ఎవడు చూపించాడు రా? వీడు పగలు, రాత్రి తెలియకుండా శ్మశానాలలో, చెట్టుతొఱ్ఱల్లో, రక్కిస కంపల్లో కూర్చుని దేవుడికోసం ఏడ్చాడు. ఆకలి వేస్తే దోసిళ్ళతో బూడిద నోట్లో పోసుకుని, కాలవలో నీళ్ళు త్రాగి ఆకలి తీర్చుకుని దేవుడికోసం రావి ఆకులా అల్లాడి పోయాడు. అప్పుడు గాని దర్శనం కాలేదు వీడికి."



"ఒరేయ్! నువ్వు భగవంతుణ్ణి తెలివిగా పట్టుకోవాలని చూస్తున్నావు రా! అట్లా దొరికేవాడు కాదు రా! ఏడవాలి వాడి కోసం! ఏడ్చేవాడికి దొరుకుతాడు రా!" అంటూ దేవుణ్ణి దర్శించే మార్గం చూపమని అడిగిన పండితునికి దేవుడిని పట్టుకొనే రహస్యం వుపదేశించింది. అవధూత శ్రీ పిచ్చమ్మగారు. ఆమె తన గురించి చెప్పేటప్పుడు "వీడు" అని, "రాముడ"ని చెబుతుంది.

అమ్మ ప్రతి వారినీ "ఒరే", "ఒసే"అని పిలుస్తుంది. దానికి కారణం ఆమే చెప్పింది. "అందరూ నాకు బిడ్డలలాగా కనిపిస్తున్నారు. అందుకే "ఒరే" అని, "ఒసే" అని పిలుస్తున్నాను" అనేది ఆమె. అమ్మకు అక్షర జ్ఞానం లేదు. కాని అక్షర లక్షలు గల సాహిత్య సామ్రాట్టులు ఆమె దివ్య పాదాల మ్రోల తల వంచారు. ఆమె ఆగర్భ దరిద్రురాలు. కాని ఆగర్భ శ్రీమంతులు ఆమె చరణాలకు ప్రణమిల్లారు. అమ్మ అనుగ్రహపూర్వకమైన మాటకొరకు, ఒక్కచూపుకొరకు భక్తకోటి తపించిపోయారు.

అమ్మది గుడివాడ తాలూకాలోని కురుమద్దాలి గ్రామం. ఈమె ముత్తాయి, వీరమ్మలకు 1870లో జన్మించింది. బిడ్డ పెరుగుతున్నకొలదీ తల్లి దండ్రుల దుఃఖం

పెరుగుతోంది. పిచ్చమ్మ ఆడుకుంటూ బొమ్మలాగా బిగిసిపోవటం జరిగేది. ఏకాంతంలో ముడుచుకు కూర్చునేది. పెద్దలు ఈమెకి గాలి చేష్టలని నిర్ణయించారు. మంత్రోచ్ఛాటన చేస్తూ కోడి పెట్టలను బలి ఇచ్చారు. ఆమెలో ఏ మార్పు కనిపించలేదు. ఆమె తల్లి దండ్రులకు దిగులు పెరిగింది. "అమ్మా! నా తలలో! నా గుండెల్లో కాదు! నా లోనే ఎక్కడో నాదాలు, శంఖం, వేణువు ఊదినట్లు ఏవేవో నాదాలు ఎంత కమ్మగా వినపడు తున్నాయని. అవి వినగానే నన్ను నేను మర్చిపోతున్నాను" అనేది.

"ఒక్కొక్కప్పుడు  ఎన్నెన్నో రంగులవి! నీలం, పసుపు, ఎరుపు రంగులతో సముద్రపుటలలల్లే రేగి, తర్వాత అన్నీ కలిసి తళ తళా మెరిసిపోతున్నాయి. ఆ రంగులు చూస్తే ఎంత ముచ్చటే స్తుందని" చెప్పేది. "అమ్మా! నా లోపల నుంచి నా అంత వయస్సు గల అమ్మాయి, బంగారు బొమ్మలా మెరుస్తూ, కాళ్ళ గజ్జెలతో గలగలలాడుతూ వచ్చి అటూ ఇటూ తిరుగుతోంది. నాతో ఏదో చెబుతోంది. నాకు ఆ మాటలు తెలియటంలేదు. ఇంతలో మాయమవుతుంది" అని అమ్మను అడిగేది. ఆ మాటలతో వీరమ్మకు మతిపోయి కన్నీటితో తన బిడ్డకు పిచ్చి ముదిరిందని బాధ పడేది.

పిచ్చమ్మకు పెళ్ళి ఈడు వచ్చింది. తుమ్మలపల్లి గ్రామంలోని నీలంవారబ్బాయికిచ్చి పెళ్ళి చేశారు. కష్టపడితే గాని కడుపు నిండని పరిస్థితి. పొలంలో పనికి వెళ్ళి కాలవగట్లమీద పడిపోతూ ఉండేది. "మూర్ఛదాన్ని మోసం చేసి కట్టబెట్టారు రా!" అని అందరూ అంటూ ఉంటే, ప్రేమతో ఆలిని ఆదరించి చేతనైన వైద్యం చేయిస్తున్నాడు.

ఆ నాటి తన కాపురం సంగతి అమ్మే ఇలా చెప్పింది: "అతడు చాలా మంచివాడు. నల్లగా ఉంటాడు. ఆజానుబాహుడు. అతడు అలా వెళ్తుంటే ఈ మాయమగడు ఎప్పుడు పోతాడు? కమ్మని మగడు ఎప్పుడు వస్తాడు? అని అనిపించేది. నేలమీద మనిషి బొమ్మ గీసి 'చస్తాడు' అన్నట్లుగా చెరిపేసేదాన్ని. ఆమె వెంటనే గురువునవుతాను కదా! ఉపదేశం చేస్తాను కదా! గొడ్డుమోతుది ఉపదేశం చేయటం ఏమిటి? అంటారని ఒక బిడ్డ కలిగాక ఈ మాయగాడు పోవాలి అనుకొనేదాన్ని."

"గురువునవుతానని నీకు ముందే తెలుసునన్నమాట" అని అడిగింది ఆమె శిష్యురాలు.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD